ప్రజాశక్తి
ఆదివారం 11 జూన్ 2023




## పోలీసు సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

**విజయనగరం :** జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పోలీసు సంక్షేమ పాఠశాలలో మూడు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్లుగా ఎస్‌పి దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు, ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్‌ను ఆంగ్ల మాధ్యమంలో బోధించాల్సి ఉంటుందని చెప్పారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతను తెలిపే ఒరిజినల్ ధ్రువపత్రాలు, బయోడేటా తీసుకొని ఈ నెల 16న ఉదయం 10 గంటలకు పాఠశాలలో నిర్వహించే టీచింగు డెమో, మౌఖిక పరీక్షకు హాజరుకావాలని కోరారు. ఇంగ్లీషు ఉపాధ్యాయుని పోస్టుకు బిఎ లేదా ఎంఎ (ఇంగ్లీషు), ఫిజికల్ సైన్స్ పోస్టుకు బిఎస్‌సి లేదా ఎంఎస్‌సి (ఫిజికల్ సైన్స్), మ్యాథ్స్ పోస్టుకు బిఎస్‌సి లేదా ఎంఎస్‌సి(మాథ్స్) పూర్తిచేసి, బిఇడితోపాటు టెట్ క్వాలిఫై అయ్యుండాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం స్కూల్ హెచ్‌ఎం 9491799315, రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్, వెల్ఫేర్ 8333098659 నంబర్లను సంప్రదించాలని కోరారు.



# మద్దతు పిసరంతే..!

**ప్రభుత్వ విధానాల కారణంగా వ్యవసాయ సాగులో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. కానీ, అందుకనుగుణంగా వ్యవసాయ ఉత్పత్తులకు మద్ధతు ధర ప్రకటించలేదు. కంటితుడుపుగా పెంచడంతో రైతన్న ఆశా నిరాశల మధ్య కొట్టుమిట్టాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓవైపు మార్కెటింగ్ సదుపాయం అంతంతమాత్రమే. దీన్ని ఆసరా చేసుకుని దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అన్నదాత అడుగడుగునా దోపిడికీ గురౌతున్నాడు.**

- సాగులో పెరిగిన పెట్టుబడులు
- మదుపునకు అనుగుణంగా పెంచని మద్దతుధర
- ఆశ, నిరాశల మధ్య అన్నదాత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్ధతు ధర (ఎంఎస్‌పి) ప్రకటించిన విషయం విధితమే. సాధారణ వరి క్వింటాకు రూ.143, ఎ గ్రేడ్ - వరి క్వింటాకు రూ.163 చొప్పన పెంచుతున్నట్లు ప్రకటించింది. పెసరపై 10.4శాతం మద్ధతు ధర పెంచినట్లు కేంద్రప్రభుత్వం పేర్కొంది. మొక్కజొన్న తదితర పంటల ధరలు కూడా ప్రకటించింది. జిల్లాలో వరి ప్రధాన పంట. ఖరీఫ్‌లో అత్యధికంగా 2,32,500 ఎకరాల్లోనూ, రబీలో 2వేల ఎకరాల్లోను సాగవుతోంది. ఖరీఫ్‌లో 5.53లక్షల మెట్రిక్ టన్నులు, రబీలో 4,740మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అవుతోంది. ఖరీఫ్ ఉత్పత్తిలో 3.45టన్నుల వరకు రైతులు విక్రయిస్తున్నారు. ఈనేపథ్యంలో పెంచిన ధరలను ఒక్కసారి పరిశీలిస్తే పెరిగిన ముదుపులకు తగ్గట్టుగా లేవని, రైతులు, రైతు సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది రూ.2040 ఉన్న సాధారణ వరి ప్రస్తుతం రూ.20183కి, రూ.2060 కలిగిన ఎ-గ్రేడ్ వరి రూ.2203కి చేరనుంది. దీన్ని గత ఏడాదితో పోలిస్తే చాలా ఎక్కువగా పెంచినట్టు కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. కానీ, వరిసాగులో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల వల్ల ట్రాక్టర్ దుక్కులు మొదలుకుని సాగునీరు, కోతలు, నూర్పులు తదిత యంత్రాల అద్దెలు అమాంతంగా పెరిగిపోయాయి. ఇటువంటి మదుపు ఎకరాకు గత ఏడాది రూ.5,500 ఉంటే, పెరిగిన ధరల వల్ల రూ.6,500 వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు. పెరుగుల మందులపై రూ.500, ఉబాల మదుపు రూ.1500 నుంచి రూ.2వేల వరకు పెరగనుంది. ఎకరాకు రూ.50వేల నుంచి రూ.55వేల వరకు మదుపు అవుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎకరాకు రూ.5వేల నుంచి రూ.8వేల వరకు పెరిగే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో వరి కనీస మద్ధతు ధర ఏమాత్రమూ సరిపోయే పరిస్థితి లేదు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వరిసాగుకు అయ్యే మొత్తం మదుపుపై అదనంగా 50శాతం శాతం కలపాలంటూ రైతులు, రైతు సంఘాలు మద్ధతు ధర కోసం చాలా ఏళ్లగా పోరాడుతున్న విషయం విధితమే. ప్రభుత్వం దాన్ని పక్కనబెట్టి కేవలం పెంచిన ధరనే గొప్పగా చెప్పుకుంటోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా కనీసం స్పందించకపోవడం గమనార్హం. మిగిలిన పత్తి, మొక్కజొన్న, పెసలు తదితర అపారాలపై పెంచిందీ కంటి తుడుపుగానే ఉంది.

### తప్పుడు లెక్కలతో రైతులకు మోసం



కేంద్ర ప్రభుత్వం తప్పుడు లెక్కలతో రైతులను మోసం చేస్తోంది. పెట్టుబడులపై 50శాతం కలిపి మద్ధతు ధర ప్రకటించామని ప్రభుత్వం చెబుతోంది. వాస్తవానికి క్వింటాకు రూ.2,150 ఖర్చు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు పంపింది. ఈ విధంగా పరిశీలిస్తే క్వింటాకు మద్ధతు ధర రూ.3,100 వరకు రావాలి. కానీ, ప్రస్తుతం ప్రకటించిన ధరల ప్రకారం సాధారణ రకం రూ.2183, ఎ-గ్రేడ్‌కు రూ.2203 మాత్రమే పలుకుతోంది. దీన్నిబట్టి పెట్టుబడులు, దిగుబడులు మసిబూసి మారెడుకాయ చేసిందన్న విషయం స్పష్టంగానే అర్ధమౌతోంది. చిత్తశుద్ధి ఉంటే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి.

\- బుద్ధరాజు రాంబాబు,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

బిజెపి విద్రోహ పాలనపై

# నేడు జిల్లా వ్యాప్త నిరసనలు

**సిపిఎం, సిపిఐ పిలుపు ● స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపేస్తున్నట్లు అమిత్‌షా ప్రకటించాలని డిమాండ్**

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తొమ్మిదేళ్ల విద్రోహ పాలనపై ఆదివారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు తమ్మినేని సూర్యనారాయణ, ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. జిల్లా ప్రజలు, వామపక్షాల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం.. ఆంధ్ర రాష్ట్రానికి, అందునా ఉత్తరాంధ్రకు, విశాఖపట్నానికి తీవ్ర ద్రోహం చేసిందన్నారు. పోర్టు, రక్షణ రంగం, రైల్వే, విద్యుత్తు, ఆయిల్ పరిశ్రమలు, బ్యాంకులు, ఎల్‌ఐసి, పోస్టల్, బిఎస్‌ఎన్‌ఎల్ తదితర ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోందని తెలిపారు. ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేసేవిధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయడానికి పూనుకున్న మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. మరోవైపు వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచి ప్రజలపై పెనుభారాలు మోపిందన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులను నిరాయుధులను చేసిందని తెలిపారు. రైతులకిచ్చే సబ్సిడీలను హరించి, పంటకు సరైన గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా అన్నదాతల ఆత్మహత్యలకు కారణమవుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీలను బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. రాష్ట్రానికి అన్నింటా ద్రోహం చేసి విశాఖలో ఈ నెల 11న విజయోత్సవ సభకు పూనుకోవడం సిగ్గుచేటన్నారు. ఇది విజయోత్సవ సభ కాదని, విద్రోహ సభని ధ్వజమెత్తారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విశాఖ సభలో పాల్గొనే ముందు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రం అన్నింటా రాష్ట్రానికి ద్రోహం చేస్తుంటే అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పల్లెత్తు మాటనకపోవడం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేయడమేనని వ్యాఖ్యానించారు. 11న చేపట్టే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం నాయకులు రెడ్డి శంకరరావు, టివి రమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

## 18 మంది రక్తదానం

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విజయ బ్లడ్ బ్యాంకులో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 18 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్త నిల్వల కొరత కారణంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ అధ్యక్షులు షేక్ ఇల్తమాష్ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు అశోక్, సాయి కుమార్, రాయల్ క్యాబ్స్ శరత్, విజయ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ పి.శివ, విజయం హెల్ప్ ఆర్గనైజేషన్ రాము పాల్గొన్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల జోక్యంతో శ్రీచైతన్య జూనియర్ కళాశాల నుంచి ఇళ్లకు వెళ్లిపోతున్న విద్యార్థులు

# సెలవుల్లో తరగతుల నిర్వహణ

**అడ్డుకున్న ఎస్‌ఎఫ్‌ఐ**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పలు కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలను శనివారం ఎస్‌ఎఫ్‌ఐ బృందం సందర్శించింది. శ్రీచైతన్య, నారాయణ జూనియర్ కళాశాలలను, పలు ఇతర డిగ్రీ కళాశాలలను మూయించి, విద్యార్థులను ఇళ్లకు పంపించేశారు. పుస్తకాల పేరుతో దోపిడీ చేస్తున్న భాష్యం స్కూల్ వద్దకు చేరుకొని పుస్తకాల అమ్మకాన్ని నిలుపుదల చేశారు. ఇకపై పుస్తకాలు విక్రయించబోమని వారితో హామీ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.రామకృష్ణ మాట్లాడుతూ ఓవైపు ఎండలు మండిపోతుంటే, నెలకు ఒకసారి వచ్చే రెండో శనివారపు సెలవును కూడా కార్పొరేట్ కళాశాలలో విద్యార్థులకు అందకుండా తరగతులు నిర్వహించడం దారుణమన్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ కరువైందన్నారు. పలు కార్పొరేట్ పాఠశాలలు పుస్తకాలు, ఫీజుల పేరుతో వేలకు వేలు వసూలు చేస్తున్నాయని చెప్పారు. దీనిని పట్టించుకోవాల్సిన ఎంఇఒ, డిఇఒ మొద్దునిద్ర వీడి ఇటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులను చదువుల పేరుతో పుస్తకాలకు బందీలను చేయడం మానేసి, వారిలో సృజనాత్మకతను పెంచే విధంగా తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.సౌమ్య, జె.రవికుమార్, పట్టణ కార్యదర్శి రమేష్, నాయకులు జగదీష్, సోమేష్, రమేష్ , లావణ్య తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్య డిగ్రీ కళాశాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

# కొనసాగుతున్న ఉపాధ్యాయ బదిలీలు

- నేటితో ముగింపు..
- 12న కొత్త స్థానాల్లోకి టీచర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం నుంచి ఆప్షన్లు పెట్టుకుంటున్నారు. కోరుకున్న స్థానాలను ఎంపిక చేసుకుంటున్నారు. బదిలీ ప్రక్రియంతా ఆన్‌లైన్‌లోనే సాగుతోంది. ఇంటి నుంచే ఉపాధ్యాయులు కంప్యూటర్లలో ఖాళీలను చూసుకొని తమకు అనుకూలమైన స్థానాలను ఎంపిక చేసుకున్నారు.

వారం రోజులుగా బదిలీలపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖ అధికారులు తర్జనభర్జనల అనంతరం ఖాళీలను ఖరారు చేశారు. వాటిని ఉన్నతాధికారులకు పంపి ఆమోదం పొందారు. శుక్రవారానికి స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ ముగిసింది. బదిలీ అయిన, ఉద్యోగోన్నతులు పొందిన వారు ఎంపిక చేసుకున్న స్థానాలకు వెళ్లిపోయారు. ఐదు వేల మంది వరకూ బదిలీల్లో భాగస్వాములు కాగా, ఇందులో ప్రధానోపాధ్యాయులు 130 మంది, స్కూల్ అసిస్టెంట్లు, పండిట్లు 1103 మందికి పైగా తప్పనిసరిగా బదిలీ అయ్యారు. విద్యాశాఖ అధికారులు సబ్జెక్టుల వారీగా షెడ్యూల్ నిర్ణయించారు. ఖాళీలు ప్రకటించిన వెంటనే ఆప్షన్లు పెట్టుకుంటున్నారు. ఇదంతా గుట్టుగానే సాగుతోంది. ఇప్పటివరకూ జిల్లాలో ప్రధానోపాధ్యాయులు 130 మంది, స్కూల్ అసిస్టెంట్లు సోషల్, సైన్స్, లెక్కలు, వ్యాయామ ఉపాధ్యాయులు 611 మంది, ప్రమోషన్ల ద్వారా 25 మందికి, లాంగ్వేజ్ పండిట్లు ఇంగ్లీష్, హిందీ, తెలుగు సబ్జెక్టులకు 502, ప్రమోషన్ల ద్వారా 110 మందికి శుక్రవారం అర్ధరాత్రి వరకు బదిలీలు జరిగాయి. శనివారం వారంతా బదిలీ అయిన పాఠశాలల్లో చేరారు. శనివారం నుంచి 2400 పైగా ఎస్‌టిజిలకు బదిలీ కౌన్సిలింగ్ కొనసాగుతోంది. తప్పనిసరిగా బదిలీ కావాల్సిన ఎస్‌జిటిలు 2400 మందికి పైగా ఉన్నారు. బదిలీల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోందని జిల్లా విద్యా శాఖ అధికారులు తెలిపారు. బదిలీల ప్రక్రియ ఆదివారంతో ముగియనుంది. ఈ నెల 12న బదిలీల అయిన స్థానాల్లో చేరాల్సి ఉంది.

పిఇటిలు 30మంది, లాంగ్వేజ్ పండిట్లు 61 మందికి బదిలీ జరగాల్సి ఉంది. వీరి బదిలీ ప్రక్రియ మాన్యువల్ పద్ధతిలో నిర్వహిస్తారు. ఇక డిఇఒ పూల్, అనారోగ్య, ఇతర సమస్యలతో ఉన్న వారిని ప్రాధాన్యత కేటగిరీలో పెట్టారు. వారికి పట్టణాలకు దగ్గరలో ఉన్న స్థానాల్లో అవకాశాలు కల్పించనున్నారు.



కొత్తగా చేరిన ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతున్న సహోద్యోగి

## రెండోసారీ పెచ్చులూడిన దండిగాం రోడ్డు

ప్రజాశక్తి -సాలూరు

పట్టణం లోని బోసు బొమ్మ జంక్షన్ నుంచి పిఎన్ బొడ్డువలస సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాల వరకు నిర్మించిన రహదారి మూణ్ణాళ్ల ముచ్చటగా మారింది. సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ రహదారి నిర్మాణ పనిని గత ఏడాది ఆగస్టులో చేశారు. అప్పుడు వర్షం పడుతున్న సమయంలో కాంట్రాక్టరు రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో నాణ్యత లేక యధావిధిగా పెచ్చులూడి గుంతలుగా తయారైంది. కోటి రూపాయల అంచనాతో ఈ రహదారి నిర్మాణంలో కాంట్రాక్టరు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో అస్తవ్యస్తంగా తయారైంది. తారు రోడ్డు నిర్మాణం చేపట్టినప్పుడు పాత రోడ్డును బాగా గీకి టేగ్ కోట్ వేయాల్సి ఉంది. అయితే ఆ విధంగా టేగ్ కోట్ వేయకపోవడంతో కొత్తగా వేసిన తారు రోడ్డు పైపొర తరచూ లేచి పోతోంది. మొదటిసారి పనులు చేసినప్పుడు తగిన ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే రెండోసారి వేయాల్సి వచ్చింది. రెండోసారి కూడా ప్రమాణాలు పాటించకపోవడంతో పెచ్చులూడిపోతోంది.

## సామాన్యుల నడ్డివిరిచేలా విద్యుత్తు ఛార్జీలు

**టిడిపి జిల్లా ప్రధానకార్యదర్శి ఐవిపి రాజు**

ప్రజాశక్తి-విజయనగరం కోట

సామాన్యుల నడ్డివిరిచేలా విద్యుత్తు బిల్లులు వస్తున్నాయని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు తెలిపారు. శనివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు ఛార్జీలను అదుపు చేయడంలో, కోతలను నివారించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. గత టిడిపి హయాంలో ఒక్క పైసా కూడా విద్యుత్తు ఛార్జీ పెంచలేదని గుర్తుచేశారు. విద్యుత్ ఛార్జీ ఆనాడు రూ.200 వస్తే నేడు సామాన్యుల నడ్డి విరిచే విధంగా రూ.వెయ్యికు పైగా వస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్తు ప్లాంట్ల నిర్వహణను ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. మళ్లీ టిడిపి అధికారంలోకి వస్తే విద్యుత్తు కష్టాలు తీరుతాయని చెప్పారు. టిడిపి పట్టణ అధ్యక్షులు లక్ష్మీ వరప్రసాద్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అంతా విధ్వంసమే తప్ప అభివృద్ధేమీ లేదన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు కనకల మురళీమోహన్, పట్టణ కార్యదర్శి బంగారు బాబు, రాజేష్ బాబు, గంటా పోలినాయుడు, కర్రోతి నర్సింగరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై

## ఎన్‌జిఒ సంఘం హర్షం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడంపై ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు జె.మురళి, జిల్లా కార్యదర్శి సురేష్ హర్షం వ్యక్తంచేశారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో తొలుత ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి థాంక్యూ సిఎం సార్.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఎన్‌జిఒ సంఘం ఎల్లప్పుడూ ఉద్యోగుల సంక్షేమం, ప్రయోజనాలు కాపాడేందుకు కృషి చేస్తుందన్నారు. మొత్తం కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేసే వరకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ క్రమంలో తమకు సహకరించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఉద్యోగుల సలహాదారు చంద్రశేఖరరెడ్డి, రాష్ట్ర ఎన్‌జిఒ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కె.వి.శివారెడ్డి, సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగుల సంఘాల నాయకులు ప్రసాద్, రమణ, సత్యప్రసాద్, శేఖర్, సుధాకర్, ఆనంద్, పైడిరాజు, మూర్తి, కనకరాజ్, శ్రీధర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 27వ డివిజన్‌లో గడపగడపకు..

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 27వ డివిజన్‌లో శనివారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యాన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జొన్నగుడ్డి, ఉప్పర వీధి ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల వివరాలను తెలియజేస్తూ బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా ? అని ఆరాతీశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. స్థానికుల నుంచి పథకాలు సక్రమంగా అందుతున్నట్లు సమాధానం రావడంతో ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు.

ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ నగరంలో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఇప్పటివరకు 27 సచివాలయాల పరిధిలో పూర్తయిందన్నారు. 27వ డివిజన్‌లో నాలుగో రోజు పర్యటిస్తున్న సందర్భంలో ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను కూడా వెనువెంటనే పరిష్కరిస్తూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, కార్పొరేటర్ దుప్పాడ సునీత, వైసిపి నాయకులు దుప్పాడ అప్పారావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలపై ఆరాతీస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

# పర్యావరణ పరిరక్షణ ఒక్కరోజు ఆర్భాటం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో పర్యావరణ పరిరక్షణ ఒక్కరోజు ఆర్భాటంగా మారిందా? అంటే ఔననే సమాధానం బలంగానే వినిపిస్తోంది. ఈ విషయంలో అటు ప్రభుత్వానికి, ఇటు అధికార యంత్రాంగానికి చిత్తశుద్ధి లేదనే వాదన కూడా గట్టిగానే ఉంది. ప్రభుత్వ విధానాలు, స్వార్థపూరిత వైఖరి, ప్రజల నిర్లక్ష్యం.. కారణం ఏదైనా పర్యావరణం మాత్రం కలుషితమౌతూనే ఉంది. పంచ భూతాలుగా చెప్పుకుంటున్న గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశంలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. బహుశా అందువల్లే అకాల వర్షాలు, వడగాల్పులు మానవాళిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తిరిగి వాతావరణ సమతుల్యతను పాటించేందుకు ప్రత్యేకంగా దినోత్సవాలు, వివిధ కార్యక్రమాలు ప్రభుత్వాలు చేపడుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీన ప్లాస్టిక్ వాడకం, మొక్కల ప్రాధాన్యత, చెట్ల సంరక్షణ, భూగర్భజలాల పరిరక్షణ, వాయు కాలుష్యంపైనా సదస్సులు, ర్యాలీలు, సమావేశాలు పలు శాఖల ఆధ్వర్యాన జరిగాయి. ఇందులో చిత్తశుద్ధి ఎంత? అన్నది ప్రస్తుతం పబ్లిక్ టాక్‌గా మారింది. ఇందుకు కారణం లేకపోలేదు. ప్లాస్టిక్ వల్ల భూమి వేడెక్కుతుందంటూనే వాటి నిషేధంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధి కనబర్చడం లేదు. ఒకప్పుడు బ్యాగులు, గోనె సంచులు, బుట్టలు వంటివి జ్యూట్, వెదురు, చింతపిక్కలతో తయారు చేసేవారు. వాటి వల్ల ఆయా వృత్తిదారులు జీవనోపాధి పొందేవారు. పర్యావరణానికి ఇబ్బంది ఉండేది కాదు. కార్పొరేట్ సంస్థలు వాటిని ప్లాస్టిక్, పాలిథిన్ వంటి రూపాల్లో అందంగా, ఆకర్షణీయంగా తయారు చేసి వ్యాపారపరం చేయడంతో ఆయా వృత్తిదారులు జీవనోపాధి కోల్పోయారు. క్రమంగా జ్యూట్ ఉత్పత్తులు తగ్గుముఖం పట్టడం వల్ల సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోయింది. ఒకప్పుడు విజయనగరం జిల్లా గోగు సాగుకు, జ్యూట్ మిల్లులకు పెట్టింది పేరు. ప్రత్యేకంగా రైతుల నుంచి గోగునార కొనుగోలు చేసేందుకు స్థానికంగా జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఉండేది. క్రమంగా జ్యూట్ ఉత్పత్తులను తగ్గించడం వల్ల ఒకప్పుడు 20 మిల్లులు ఉన్న ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం నాలుగైదుకు మించి తిరగడం లేదు. ఇటువంటివన్నీ పట్టించుకోకుండా ఉత్తుత్తి హడావుడి ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు.




మరోవైపు ఇష్టారాజ్యాంగా మైనింగ్ అనుమతులు ఇవ్వడం, అనుమతుల్లేకుండానే మైనింగ్ చేయడం వంటి కారణాల రీత్యా చాలా గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. భూగర్భజలాలు కలుషితమౌతున్నాయి. ఇక చెట్లు నరికేయడం తప్ప మొక్కలు నాటిన సందర్భాలు లేవు. మొక్కలు నాటడంపై ప్రభుత్వ లెక్కలన్నీ రికార్డుల్లో మాత్రమే కనిపిస్తున్నాయి. వాల్టా చట్టానికి యథేచ్ఛగా తూట్లు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం వలేదు. దీంతో, ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు సహజ ఇంధన వనరులను వినియోగించాలంటూనే వాటి ధరలు ఆకాశాన్ని అంటే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. బ్యాటరీతో నడిచే మోటార్ సైకిళ్ల ధర కూడా ఎక్కువగానే ఉంది. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వానికి గానీ, అధికారులకు గానీ చిత్తశుద్ధి లేదని, లేదంటే ఒక్కరోజు ఆర్భాటం కాకుండా ఏడాది పొడవునా కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణపై ఉద్యమం సాగేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

# నాడు- నేడు రెండో దశ పూర్తయ్యేనా..?

●ఇంకా పూర్తి కాని పాఠశాలల్లో అభివృద్ధి పనులు ●రేపటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం ●ఇరుకు గదుల్లోనే ఈ ఏడాదీ చదువులు పాఠశాల ●కమిటీలతో నిర్మాణ పనుల్లో జాప్యం

**ప్రజాశక్తి- రేగిడి**

మనబడి, నాడు- నేడు రెండో విడత పాఠశాలల నిర్మాణాలు మందకొడిగా సాగడంతో ఈ ఏడాది జూన్ 12న పాఠశాలలు పున: ప్రారంభం నాటి నుంచి విద్యార్థులకు కష్టాలు తప్పేటట్లు లేవు. విద్యార్థులకు సరైన విద్యా వసతి లేకపోవడంతో రెండో విడతలో మనబడి, నాడు- నేడు కార్యక్రమంలో పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. అభివృద్ధి పనులను అన్నిచోట్ల ప్రారంభించినప్పటికీ సకాలంలో పనులు పూర్తి చేయలేకపోయారు. పైగా అధికారులు సూచించిన సమయానికి నూతన హంగులతో పాఠశాలలను అందించలేమని ఖరాకండిగా పాఠశాల కమిటీలు చెప్తున్నాయి. దీంతో నూతన విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులకు పాత కష్టాలు తప్పడం లేదు.

మండలంలోని రెండో విడత మనబడి, నాడు- నేడు కార్యక్రమంలో 37 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలతో పాటుగా 6 అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేశారు. కందిస, జోడు బండల, ఉనివాడ దేవుడల, చిన్న లింగాల వలస, తోకలవలస, అంబఖండి, ఉంగరాడ, రేగిడి తదితర గ్రామాల పాఠశాలల్లో పనులు అట్టహాసంగా ప్రారంభించినప్పటికీ నిర్మాణ పనుల్లో జాప్యం తప్పలేదు. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్ల ప్రాథమిక దశలోనే ఉన్నాయి. మరి కొన్ని పాఠశాలల్లో స్లాబ్ దశలోనే ఉన్నాయి. బాలికావిద్యాలయ పాఠశాలలో పూర్తిగా ప్యాచ్ లేవు. ఇంకొన్ని పాఠశాలల్లో రన్నింగ్ వాటర్ లేకపోవడంతో ఈ ఏడాది కూడా విద్యార్థులకు తాగునీటి కష్టాలు తప్పేలా లేదు.

**అరకొర పాఠ్య పుస్తకాలు**

మండలంలోని 57 ప్రాథమిక పాఠశాలలు, 10 ప్రాథమికోన్నత పాఠశాలలు, 12 ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బా గాంధీ పాఠశాల, గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 5,758 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరితో పాటు ఈ ఏడాది కొత్తగా చేరుతున్న విద్యార్థులకు కూడా పాఠ్య పుస్తకాలు అందించాల్సి ఉంది. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు 73,872 పాఠ్య పుస్తకాలు అవసరంగా


మధ్యలో నిలిచిపోయిన పాఠశాల మరుగుదొడ్ల పనులు

గుర్తించారు. కానీ 52,116 పుస్తకాలు మాత్రమే మండల కేంద్రానికి చేరాయి. మిగతా 21వేల పుస్తకాలు ఇంకా రావలసి ఉంది. మరో రెండు రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో పుస్తకాలు రాకపోవడంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు సైతం ఆందోళన చెందుతున్నారు.

**గతేడాది కంటే తగ్గిన పది ఉత్తీర్ణత**

గతేడాది కంటే ఈ ఏడాది 14 పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గినట్లు లెక్కల్లో తేలింది. గతేడాది 85 శాతం విద్యార్థుల ఉత్తీర్ణత కాగా, ఈ ఏడాది 80 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. దీనిపై ఉపాధ్యాయులకు కూడా చర్చించుకున్నారు. కొన్ని లోపాల కారణంగా ఉత్తీర్ణత శాతం తగ్గినట్లు తెలుస్తుంది.

**పాఠశాలల పునఃప్రారంభానికి అందించలేం**



పాఠశాలల పున: ప్రారంభానికి అని వర్క్ కారణాల వల్ల నాడు నేడు కార్యక్రమంలో ఎంపికైన పాఠశాలల్లో జరుగుతున్న నిర్మాణాలను పూర్తి చేసి అందించలేం. పాఠశాలల పేరెంట్స్ కమిటీ బీం వర్క్ కారణంగా లేట్ అవుతుంది. కొన్ని పాఠశాలల్లో స్థానిక నాయకులు కాంట్రాక్టర్ పనులు చేయడంతో శరవేగంగా జరుగుతున్నాయి. కూలీల కొరత, ఎండలు తీవ్రత కారణంగా నిర్మాణ పనులు జాప్యం అయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పనులు చేపట్టినప్పటికీ పనులు మంద కొడిగా జరగడంతో జాప్యం జరిగింది. మరో నెల రోజుల్లో పూర్తి చేస్తాం.

- ఎం. వరప్రసాదరావు, ఎంఇఒ, రేగిడి.

## ఆక్రమణ భూమిలో అంబేద్కర్ విగ్రహం

**ప్రజాశక్తి - లక్కవరపుకోట**

మండలంలోని కొట్యాడ గ్రామపంచాయతీలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రి అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే కొట్యాడలో జగనన్న కాలనీకి ఆనుకొని సర్వే నెంబర్ 218 -1లో పాలశీతలీకరణ కేంద్రం, ఇతర ప్రభుత్వ కట్టడాల కోసం సుమారు 20 సెంట్లు భూమిని కేటాయించారు. గతంలో దానిని కబ్జా చేసేందుకు అదే గ్రామానికి చెందిన కొందరు ప్రయత్నించడంతో అప్పటి తహశీల్దార్ తామరపల్లి రామకృష్ణ ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వాళ్లు శిక్షార్హులని తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ భూమిని ఎలాగైనా కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కొందరు అంబేద్కర్ కమిటీ భూమిని ఆక్రమించిన అంటూ కొత్త నినాదాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో వీఆర్వో ప్రసాద్, సచివాలయ కార్యదర్శి గోవింద్, మహిళా పోలీస్ స్వాతి, గ్రీన్ అంబాసిడర్లు తదితరుల సమక్షంలో మరల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. చేసేదేమీ లేక ఆ భూమిపై కన్ను వేసిన కొందరు రాత్రికి రాత్రే అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. భూమి ఆక్రమణ కోసం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించడం చర్చనీయాంశమైంది. ఈ విషయంపై కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ ఉత్తరాపల్లి ఆదిబాబుని వివరణ కోరగా ప్రభుత్వ భూముల్లో విగ్రహ ప్రతిష్టకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అయినప్పటికీ ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా ప్రభుత్వ భూములలో ఏ విగ్రహాన్ని ప్రతిష్టించకూడదని తెలిపారు. కొట్యాడ పంచాయతీలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట పై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

## ఎంవిజిఆర్‌లో ముగిసిన వర్క్‌షాప్

**ప్రజాశక్తి- డెంకాడ**


మాట్లాడుతున్న రాజేష్‌కుమార్

డిఎస్‌టి, సెర్బ్ నిధులతో ఇసిఇ డిపార్టుమెంట్ నిర్వహించిన 6 రోజుల వర్క్‌షాప్ ఎంవిజిఆర్‌లో శనివారం ఘనంగా ముగిసింది. 'డిజైన్ అండ్ సిమ్యులేషన్ ఆఫ్ మినియేచర్ యాంటెనా యూజింగ్ మెషీన్ లెర్నింగ్ ఫర్ ఐఒటి అప్లికేషన్స్' అనే అంశంపై జూన్ 5 నుంచి జూన్ 10 వరకు ఆరు రోజులు పాటు కొనసాగిన శిక్షణా ముగిసింది. ముగింపు వేడుకకు ముఖ్య అతిథిలుగా ఆంధ్రయూనివర్శిటీ ప్రొఫెసర్, హెడ్ డాక్టర్ పి. రాజేష్ కుమార్, డిఆర్‌డిఒ రాడార్ అంటెన్నాస్ అండ్ కంపోనెంట్స్ డివిజన్ సైంటిస్ట్-ఇ సాంబశివరావు హాజరై మాట్లాడారు. ముందుగా సాంబశివరావు 'మెటామెటీరియల్ ఫర్ ఏరోస్పేస్ అంటేన్నా అప్లికేషన్స్' అనే అంశం పై అవగాహన కల్పించారు. డాక్టర్ రాజేష్ కుమార్, ఐఈటిఈ చైర్మన్‌గా ఉన్నందున, ఇలాంటి శిక్షణా తరగతులు ప్రొఫెషనల్ బాడీ ఆక్టివిటీస్ అనుసందానంగా జరిగితే బాగుంటుందని వివరించారు. ప్రభుత్వం ఇలాంటి శిక్షణ కార్యక్రమాలకు తోడ్పాటు పెంచితే, సాంకేతిక విద్యాబోధనలో అనితరసాధ్యం అయిన మార్పులు చూడవచ్చని చెప్పారు. అనంతరం అభ్యర్థులకు సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్లేస్మెంట్స్ డాక్టర్ సునీల్ ప్రకాష్, డాక్టర్ ఎం. సత్యనారాయణ, వైఎంసీ శేఖర్, డాక్టర్ ఆర్ రమేష్, డాక్టర్ షేక్ మస్తాన్ వలి, ఇతర విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## సిఎంకు ఉద్యోగుల ధన్యవాదాలు

**ప్రజాశక్తి - కొత్తవలస**

కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ, స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు దుస్సాలువ కప్పి ఘనంగా శనివారం తన క్యాంపు కార్యాలయం వద్ద సన్మానించారు. ప్రభుత్వం పారామెడికల్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం ప్రకటించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల కాంట్రాక్టు ఉద్యోగులు జగన్మోహన్ రెడ్డి ఫొటోకు పాలాభిషేకం చేసి ఎమ్మెల్యేను సత్కరించారు. గత 20 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేసి, చాలీ చాలని జీతాలతో జీవితాలను నెట్టి కొచ్చి వయస్సు మీరి చాలా మంది ఉద్యోగులు విధి నిర్వహణలో అసువులు బాసారని గుర్తు చేశారు. అటువంటి తమను రెగ్యులర్ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వి. చినరామునాయుడు, కాంట్రాక్టు ఉద్యోగులు నాయకులు, ఎపిఎన్‌జిఒ కొత్తవలస జాయింట్ సెక్రటరీ ఈశ్వరావు, జె.వి.ప్రసాద్, ఎల్. సత్యారావు, సూర్యారావు, రామకృష్ణ, సాయి, శేఖర్, వెంకటరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

## లీకులతో తాగునీరు వృథా

**ప్రజాశక్తి- బొబ్బిలి**


రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

పట్టణంలో లీకులతో తాగునీరు వృథాగా పోతుంది. బలిజిపేట రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున కోరాడవీధి జంక్షన్ వద్ద పైపులైన్ లీకవ్వడంతో తాగునీరు వధాగా పోతుంది. వేసవిలో తాగునీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లీకులను నివారించి సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉత్తమ ఐటిడిపి అధ్యక్షులుగా నారాయణరావు

**ప్రజాశక్తి - గుర్ల**


నారాయణరావును సత్కరిస్తున్న చంద్రబాబు

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళగిరిలో జరిగిన రాష్ట్ర ఐటిడిపి (సోషల్ మీడియా) అభినందన సభలో చీపురుపల్లి నియోజకవర్గం ఐటిడిపి అధ్యక్షులు నాగుల పల్లి నారాయణ రావును చంద్రబాబు అభినందించి, ప్రశంస పత్రంతో సన్మానించారు. జిల్లాలో అత్యధికంగా టిడిపి సభ్యత్వం నమోదు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ఎండగడుతూ సోషల్ మీడియాలో ముందు వరసలో వున్న సందర్భంగా నారాయణరావుని అభినందించారు. రాబోయే 2024 శాసనసభ ఎన్నికల్లో టిడిపి గెలుపునకు మీ వంతుగా సోషల్ మీడియాలో కృషి చెయ్యాలని చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర స్థాయిలో చీపురుపల్లి నియోజకవర్గానికి మంచి గుర్తింపు తెచ్చినందుకు రాష్ట్ర బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసి నాయుడు, గుర్ల మండల టిడిపి నాయకులు నారాయణ రావును అభినందించారు.

## 13న బిటి రోడ్డు ప్రారంభోత్సవం

**ప్రజాశక్తి - రామభద్రపురం**

రామభద్రపురం, సాలూరు హైవే రోడ్డు నుంచి మండలంలోని జన్నివలస గ్రామానికి ఇటీవల నూతనంగా నిర్మించిన 2 కిలోమీటర్ల బీటీ రోడ్డు ప్రారంభోత్సవానికి ఈ నెల 13వ తేదీన టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు వస్తారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే శంబంగి చినప్పలనాయుడు కోరారు. ఈ సందర్భంగా శనివారం ఆయన గ్రామ సమీపంలో ఏర్పాటు చేయబోయే బహిరంగ సభ సమావేశ స్థలాన్ని పరిశీలించారు. సభ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపిపి, జెడ్‌పిటిసిలు, వైస్‌ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యర్తలు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, మండల జేసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, వైసిపి నాయకులు డర్రు పైడిరాజు, పత్తిగుళ్ల సత్యన్నారాయణ, ఏకనాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మస్తర్లలో జాప్యం చేస్తే చర్యలు

**ప్రజాశక్తి- రేగిడి**

ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల మస్తర్లలో జాప్యం చేస్తే చర్యలు తప్పవని ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం లింగాలవలస పంచాయతీలో మంచినీటి కోనేరు పనులను ఆయన పరిశీలించారు. కోనేరులో 174 మంది వేతనదారుల మస్తర్లను తనిఖీ చేసి కూలి గిట్టుబాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబు కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. కొలతలు ప్రకారం రెండు పూటలు పనిచేస్తే కూలి గిట్టుబాటు వస్తుందన్నారు. రోజువారి వేతనం 272 రూపాయలు గిట్టుబాటు అవుతుందన్నారు. ఎంఎంఎస్ యాప్‌లో కూలీల ఫోటోలు తీసి పంపించాలని సూచించారు. వేసవి ఎండలు తీవ్రతగా ఉన్నాయని కూలీలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విధిగా తాగునీరు తీసుకువెళ్లాలన్నారు. పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ, మేట్లు వేతనదారులు ఉన్నారు

# విద్యుత్తు ఛార్జీల పెంపుపై సామాన్యుల ఆందోళన

**ప్రజాశక్తి - పూసపాటిరేగ**

జగన్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న విద్యుత్ ఛార్జీల అధిక మోత సామాన్య ప్రజలకు ఆందోళన కలిగిస్తుందని నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. విద్యుత్ చార్జీలు పెంపుపై మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో టిడిపి నేతలు పతివాడ స్వగృహం చల్లవానితోటలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక వరుసుగా ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడన్నారు. టిడిపి ప్రభుత్వంలో ఒక్కసారి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని గుర్తు చేశారు. విద్యుత్ చార్జీలు పెంపు సామాన్య ప్రజలకు పెను భారంగా మారిందన్నారు. జగన్ రెడ్డి పథకాలకు డబ్బులు అవసరమైనప్పుడల్లా అధిక ఛార్జీలు భాదే స్తున్నాడన్నారు. తన అన్యాయుల కంపెనీల నుంచి తెచ్చుకున్న నాణ్యత లేని విద్యుత్ పరికరాలతో రాష్ట్రానికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. 300 యూనిట్లు దాటితే రేషన్ కార్డు, పింఛన్లు తదితర సంక్షేమ పథకాలు కట్ చేస్తున్నారన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, నెల్లిమర్ల సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు మాట్లాడుతూ ల్యాండు సాండు, మైను, వైను, విద్యుత్తు పై తన ఇష్టారాజ్యంగా చార్జీలు పెంచుకుపోతూ


కేక్ కట్ చేసి పతివాడకు తినిపిస్తున్న కర్రోతు బంగార్రాజు

ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న ఇటువంటి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. మృగశిర కార్తి వచ్చినా ఒక్కరికీ వేరుశనగ విత్తనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. అనంతరం హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదినోత్సవ సందర్భంగా మాజీమంత్రి పతివాడతోపాటు ఇంచార్జ్ కర్రోతు బంగారు రాజు కేక్ కట్ చేశారు. బాలయ్య జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. సమావేశంలో నాయకులు ఆకిరి ప్రసాద్ రావు, పతివాడ అప్పలనాయుడు, కర్రోత్ సత్యనారాయణ, పిన్నింటి సన్యాసినాయుడు, ఇజ్జురోతు ఈశ్వరరావు, లెంక అప్పలనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు పాల్గొన్నారు.

**మాట తప్పిన ముఖ్యమంత్రిని సాగనంపాలి**

**గజపతినగరం:** మాట తప్పిన ముఖ్యమంత్రిని రాబోయే ఎన్నికల్లో సాగనంపాలని మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయావరణలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎటువంటి భారం వేయకుండా నిరంతర విద్యుత్ ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఏడుసార్లు విద్యుత్ చార్జీలను పెంచారని, దీంతో వేలాది కోట్లు భారం ప్రజలపై పడుతుందని అన్నారు. ట్రూ అప్ చార్జీల పేరిట కొత్తగా రూ.3,600 కోట్లు భారాన్ని ప్రజలపై వేయడం సబబు కాదన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు అట్టాడ లక్ష్మం నాయుడు, మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, టిడిపి నాయకులు గుంట్రోతు గోవింద, మజ్జి గోవింద తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్ చార్జీలు పెంపు దుర్మార్గం**

**బొబ్బిలి:** విద్యుత్ చార్జీలు పెంపు దుర్మార్గమని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. కోటలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచినట్లు చెప్పారు. వైసిపి అధికారంలోకి వస్తే 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పిన సీఎం జగన్మోహన్ రెడ్డి విద్యుత్ చార్జీలు పెంచి వినియోగదారులపై భారాలు వేయడం దుర్మార్గమన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## నేడు రౌండ్ టేబుల్ సమావేశం

**ప్రజాశక్తి- బొబ్బిలి**

స్థానిక లోకబందు రెసిడెన్సీలో ఆదివారం ఉదయం 10గంటలకు అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి తెలిపారు. జనసేన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించి కార్యక్రమాన్ని రూపొందిస్తామన్నారు.

## రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి- బొబ్బిలి**

బొబ్బిలి డివిజన్ పరిధిలో 132/33 సబ్ స్టేషన్‌లో మరమ్మత్తులు, సబ్ స్టేషన నుండి వచ్చే 33 కెవి లైన్స్‌లో పోల్స్ వేసి 33 కెవి లైన్స్ పటిష్ఠం చేయడం, లైన్‌కు ఇరువైపులా ఉన్న చెట్లు కొమ్మలు తొలగించడం కోసం సోమవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఇఇ పూడి శ్రీహరి తెలిపారు. ఆ రోజు ఉదయం 8గంటల నుండి మద్యాహ్నం 12గంటల వరకు 33/11 కెవి కలవరాయి, బలిజిపేట ఫీడర్స్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. కలవరాయి, పిరిడి, బలిజిపేట, జగన్నాథపురం, పెంట, పినపెంకి, వంతరాం సబ్ స్టేషన్లు పరిధిలో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. అవకాశం ఉన్న ఏరియాలకు విద్యుత్ సరఫరా ఇస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

## అంగన్వాడీ కేంద్రానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి- రేగిడి**

మండలంలోని పెద్దశిర్లాం గ్రామంలో అంగన్వాడీ- 2 నూతన భవన నిర్మాణానికి సర్పంచ్, వైసిపి నాయకులు లెంక రాంబాబు శనివారం భూమి పూజ చేశారు. నూతన అంగన్వాడి కేంద్రానికి రూ.13.5 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఇబ్బందుల దృష్టిలో ఉంచుకొని శరవేగంగా నిర్మాణాలు చేపడతామన్నారు. నూతన హంగులతో, చిన్నారులకు అర్థమయ్యే రీతిలో వివిధ రకాల బొమ్మలతో నిర్మాణాలు చేపడతామన్నారు. వీరితో పంచాయతీ కార్యదర్శి అనిత, పాఠశాల హెచ్‌ఎం చిన్నంనాయుడు, అంగన్వాడి కార్యకర్త టి. ప్రమీలారాణి, గ్రామస్తులు ఉన్నారు.

## తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ

**ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్**

బొబ్బిలి మండలానికి తహశీల్దార్‌గా డి. రాజేశ్వరరావు శనివారం పదవి భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు డిటి గౌరిశంకర్రావు, విఆర్‌ఒలు సిబ్బంది పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరమైనా సమస్యలు, రీ సర్వే, మండలంలో ఇతర సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటామన్నారు.

# బిజెపి వినాశకర పాలనపై నేడు నిరసన

**ప్రజాశక్తి- బొబ్బిలి**


కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తొమ్మిదేళ్ల విద్రోహ పాలనను నిరసిస్తూ ఆదివారం బొబ్బిలి మార్కెట్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సిపిఎం, సిపిఐ సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ, రైతు కూలీ సంఘం, పికెఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాయకులు పి.శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి ఉత్తరాంధ్రకు, విశాఖపట్నానికి తీవ్ర ద్రోహం చేసిందన్నారు. పోర్టు, రక్షణ రంగం, రైల్వే, విద్యుత్, ఆయిల్ పరిశ్రమలు, బ్యాంకులు, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్ తదితర ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరిస్తోందన్నారు. ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేసే విధంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయడానికి పూనుకున్న మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. మరో వైపు వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచి ప్రజలపై పెనుభారాలు మోపిందన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను నిరాయుధులను చేసిందని తెలిపారు. రైతులకిచ్చే సబ్సిడీలను హరించి, పంటకు సరైన గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా అన్నదాతల ఆత్మహత్యలకు


మాట్లాడుతున్న శంకరరావు

కారణమవుతోందని విమర్శించారు. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన ఎపి పునర్విభజన చట్ట హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఇలా రాష్ట్రానికి అన్నింటా ద్రోహం చేసి విశాఖలో ఈ నెల 11న విజయోత్సవ సభకు పూనుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. దీనిని విజయోత్సవ సభ అనే కంటే విద్రోహ సభ అని అన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా విశాఖ సభలో పాల్గొనే ముందు వైజాగ్ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రం అన్నింటా రాష్ట్రానికి ఇంత ద్రోహం చేస్తుంటే అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనలు పల్లెత్తు మాటనకపోవడం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేయడమేనని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పికెఎస్ జిల్లా అధ్యక్షులు తమటాల అప్పలనాయుడు, కాంగ్రెస్ పార్టీ పిసిసి మెంబర్ ముప్వల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**బిజెపి ప్రజా వ్యతిరేక పాలనపై నిరశన తెలపాలి**

**నెల్లిమర్ల:** బిజెపి ప్రజా వ్యతిరేక పాలన పై అన్నివర్గాల ప్రజలూ నిరశన తెలపాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. శనివారం బిజెపి ప్రజా వ్యతిరేక పాలన పై నిరశన వ్యక్తం చేయాలని కోరుతూ స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద కార్మికులనుద్దేసించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి తొమ్మిదేళ్ళ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీరని ద్రోహం చేసిందన్నారు. కార్మికులు, రైతులు నష్టపోయే విదంగా చట్టాలు తీసుకు వచ్చిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటు పరం చేసి ఉత్తరాంధ్రకు తీరని ద్రోహం చేసిందని ప్రభుత్వ రంగ సంస్థలు పోర్టులు, జీవిత భీమా, పోస్టల్, బ్యాంకులు, విద్యుత్, రైల్వేలు, ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసి కార్పొరేట్లు ప్రయోజనాల కోసం దేశాన్ని తాకట్టు పెట్టిందని అన్నారు. దీంతో బాటు పెట్రోల్, డీజిల్ ధరలుపెంచి సామాన్యుల పై మోయారని భారం వేసిందన్నారు. ఆంధ్ర రాష్టానికి తీరని ద్రోహం చేస్తున్న బిజెపికి విశాఖలో విజయోత్సవ సభ నిర్వహించే హక్కు లేదన్నారు. బిజెపి పాలన పై నిరశన వ్యక్తం చేయాలని రామారావు కోరారు.


వేపాడ.. డబ్బిరాజుపేటలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు శ్రీనివాసరావు, రఘురాజు

# సంక్షేమ పథకాల వెల్లువ

**ప్రజాశక్తి - భోగాపురం**

జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు వెల్లువలా ప్రజలకు అందుతున్నాయని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం చేపలకంచేరు సచివాలయం పరిధిలో దెబ్బల పాలెం, ఎర్ర ముసలయ్య పాలెం, బోయపాలెం గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల అందుతున్న తీరును, ప్రజల సమస్యలను తెలుసు కున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందని, సంక్షేమ పథకాలు బుక్ లెట్‌ను అందజేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మరో అవకాశాన్ని ఇవ్వాలని అభ్యర్థించారు. జగనన్న ఇల్లులు అందలేదని లబ్ధిదారులు ఎమ్మెల్యేను అడిగారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లులు అందేలా చర్యలు చేపడతామని ఆయన లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అరజర్ల నరసింహులు, కర్రోతు వెంకటరమణ, నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సుందర హరీష్, కర్రోతు శ్రీను, పడాల భాను ప్రకాష్, పడాల శ్రీను, ఎల్లారావు, డిబి రెడ్డి, శీరపు గుర్నాథ్ రెడ్డి, వంశీ రెడ్డి, రాము, మొక్క కృష్ణ, మహిళా నాయకులు సీత, ఎంపిడిఒ అప్పలనాయుడు, ఎపిఒ ఆదిబాబు, ఎపిఎం రమణ, కార్యదర్శి పుష్పలత, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం**

**వేపాడ:** మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో శనివారం మధ్యాహ్నం ముందుగా గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్ భవనాన్ని, రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మించిన ఈ భవనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్సీ ఎందుకూరి రఘురాజు, నాయకులు నెక్కల నాయుడు బాబు, డిసిసిబి చైర్మన్ వివి చిన్నరామ నాయుడు, ఎఎంసి చైర్మన్ కస్తూరి, నెట్ కేఫ్ మెంబర్ పద్మజ, ఎంపిపి డి. సత్యవంతుడు, జెడ్‌పిటిసి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, సర్పంచ్ దండుపాటి ముత్యాలమ్మ, చామంతులు లక్ష్మి, అధికారులు డి స్వామి నాయుడు, ఎంపిడిఒ పట్నాయక్, మండల పరిషత్ ఇంజనీరింగ్ అధికారి ఆలీ, కార్యదర్శి ధనలక్ష్మి, భారతి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, వైసిపి మండల అధ్యక్షుడు జగ్గుబాబు వాలంటీర్లు పాల్గొన్నారు.

# శివాలయం ప్రారంభోత్సవంలో 'కోళ్ల'

**ప్రజాశక్తి- శృంగవరపు కోట**

ఎస్ కోట పంచాయతి పరిధిలో గల సీతంపేట గ్రామంలోని గ్రామపెద్దలు, శివాలయం నిర్మాణ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు శివాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ ముఖ్య అతిథులుగా శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాలయం ఆలయ విగ్రహ, విమాన శిఖర, ధ్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు శివాలయంలోని మహాశివునిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించినంతరం కోళ్ల దంపతులను వేద పండితులు విన్నకోట భాస్కర శర్మ ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శివాలయం నిర్మాణ కమిటీ సభ్యులకు రూ.10వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, ఎస్.కోట గ్రామ కమిటీ కొనదం మల్లేశ్వరరావు, బీశెట్టి అరుణ, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్, టిడిపి విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాపుగంటి శ్రీనివాసరావు, ఐటిడిపి నియోజకవర్గ కార్యదర్శి అనకాపల్లి చెల్లయ్య, పెదగాడ రాజు, సరిపల్లి సురేష్, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ (శ్రీను), లాలం అర్జునరావు, పొట్నూరు వెంకట రత్నాజీ, మోపాడ చిన్నికృష్ణ, సనివాడ కాళిదాస్ పాల్గొన్నారు.

## కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి- శృంగవరపుకోట**

స్థానిక పంచాయతీ పరిధిలో గల సీతంపేటలో ఎంపి లాడ్స్ నిధులతో చేపట్టనున్న కమ్యూనిటీ భవనం నిర్మాణానికి విశాఖపట్నం ఎంపి ఎంవివి సత్యనారాయణ, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో కలసి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా ప్రారంభమైన అన్నపూర్ణ సమేత కాశి విశ్వేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వేచలపు చిన రాము నాయుడు, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, నాయకులు పార్వతి, చింతల మూర్తి, చింతల సావిత్రీ, కడారి అప్పయ్య, కోసూరి భారతి బొబ్బిలి ఎర్నమ్మ, అప్పల సత్యం, వేముల జగదీష్, చిప్పాడ రమణ, మోపాడ కోటి, నాగరాజు, పాపారావు, జయశంకర్, కామిరెడ్డి రంగా, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి, ఎమ్మెల్యేలు